ఖరీఫ్‌లో క్రాప్ హాలిడే


సత్తారామేశ్వరంలో ముంపునకు గురైన పొలాల్లో పెరిగిన కలుపు


జుత్తిగలో నారుమడి కుళ్లి, నాట్లు వేయని చేలు

- 770 ఎకరాల్లో సార్వా సాగు లేనట్లే
- వరదల కారణంగా దెబ్బతిన్న నారుమళ్లు
- చేలను ఖాళీగా వదిలేసిన రైతులు, కౌలుదారులు
- రబీకే సిద్ధమంటున్న రైతులు

పెనుమంట్ర: మండలంలోని 11 గ్రామాలకు చెందిన 770 ఎకరాల్లో ఖరీఫ్ పంటకు సంబంధించి నాట్లు వేసేపరిస్థితి కానరావడం లేదు. జూన్, జూలై మాసాల్లో అధిక వర్షాలు, వరదల కారణంగా ఈ పరిస్థితి వచ్చింది. మండలంలో 19 గ్రామాలకు, 12,206 ఎకరాల్లో ఖరీఫ్ నాట్లు వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 11,433 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పూర్తయినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారిణి కె జ్యోత్స్న బుధవారం తెలిపారు. 11 గ్రామాల్లో 519 మంది రైతులకు చెందిన 773 ఎకరాలకు సంబంధించి నారుమళ్లు దెబ్బతినడంతో రైతులు నాట్లు వేయలేకపోయారు. గోస్తనీ డ్రెయిన్ పరివాహక ప్రాంతాలైన ఎస్ ఇల్లిందలపర్రులో 164 ఎకరాలు, మల్లిపూడిలో 14 ఎకరాలు, జుత్తిగలో 91 ఎకరాలు, సత్తారామేశ్వరంలో 40, పెనుమంట్రలో 62, మాముడూరులో 264 ఎకరాల్లో, గొంతేరు డ్రెయిన్ పరివాహక ప్రాంతాలైన ఆలమూరులో 40 ఎకరాలు, భట్లమగుటూరులో 10, భగ్గేశ్వరం డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో వెలగలేరులో 3ఎకరాల్లో వరినాట్లు పూర్తికాలేదని ఆమె తెలిపారు. 773 ఎకరాల్లోని వరినాట్లు ఈఖరీఫ్‌లో వేయలేమనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నారుమడులు, నాట్లు వేసి తీవ్రంగా నష్టపోయామని, తీరా కొత్తగా నారు పోసి నాట్లు వేద్దామన్నా వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో తెలియని స్థితి నెలకొందని రైతులు అన్నారు. మరలా నాట్లు వేసి నష్టాన్ని కొనితెచ్చుకోలేమని ఇప్పటికే ప్రభుత్వ పరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందలేవని, ధాన్యం డబ్బు కూడా పూర్తిగా అందక నానా అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.6 వేలు నష్టం



ఆరు ఎకరాలు సొంత భూమి నాట్లు వేసేందుకు రెండు నెలలు క్రితం నారు పోశామని అధిక వర్షాలు వరదలు కారణంగా గోస్తనీ డ్రెయిన్ ముంపుతో నాట్లు వేయకుండానే నారుమళ్లు దెబ్బతిన్నాయి. ఇప్పటి వరకు ఎకరాకు రూ.6 వేలు చొప్పున పెట్టుబడులు పెట్టాం. ఇపుడు మరలా నాట్లు వేసినా ఫలితం ఉండదు.

– కర్రి కలికిరెడ్డి, రైతు, సత్తారామేశ్వరం

చేలనిండా కలుపు



6 ఎకరాలు సొంతభూమి, 3 ఎకరాలు కౌలుకి చేస్తున్నాను. నాట్లు వేసేందుకు నారుమడి పోసి దమ్ములు కూడా చేయించాను. నాట్లు వేసే సమయంలో వరదలు రావడంతో పూర్తిగా దెబ్బతింది. నాట్లు వేయలేకపోయాం, ఖరీఫ్ సీజన్ దాటిపోవడంతో నాట్లు వేయకపోవడంతో చేలనిండా కలుపు పేరుకుపోయింది. రబీకి సిద్ధపడదామనుకుంటున్నాం.

– గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, రైతు, జుత్తిగ

వరద ముంపుతో నష్టం



నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్నాం. నాట్లకు సిద్ధం చేసుకున్నాక వరదలు రావడంతో గోస్తనీ డ్రెయిన్ ముంపు కారణంగా ఇప్పటికీ చేలలోని వరద నీరు తగ్గలేదు. నారు, దమ్ములకు వేలాది రూపాయలు ఖర్చు చేశాం. మరలా నాట్లు వేసినా ఫలితం ఎలా ఉంటుందో తెలియదు. నష్టపోవడంతో సార్వా సాగు నిలిపివేశాం.

– బొక్కా సోమేశ్వరరావు, కౌలు రైతు, జుత్తిగ

పాలకొల్లు ఎంపీడీవోగా సంగాని బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావును అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సంగాని వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బి అనుపమ తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలానికి బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలస్థాయి అధికారులను బదిలీ చేశారు. ఎన్నికల ముగిసిన అనంతరం అధికారులను తిరిగి యధాతథంగా ఇంతకు ముందు పనిచేసిన మండలాలకు బదిలీ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో వెంకటేశ్వరరావును ఏవో కొర్రా గోవిందరాజులు, ఈవోపీఆర్‌డీ కేఎం వైభావతి, పంచాయతీ కార్యదర్శులు డీఎస్ పద్మాజీరావు, ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా), బి ఆనందబాబు, ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, శివకుమార్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

జాతీయ నులిపురుగు నివారణ పోస్టర్ ఆవిష్కరణ


పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ నులిపురుగు నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నులి పురుగు నివారణను ఆల్బెండాజోల్ మాత్రలు విధిగా మింగాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం జాతీయ నులిపురుగు నివారణ పోస్టర్‌ను ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ నెల 20న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డాక్టర్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. విద్యార్థులందరి చేత మాత్రలు మింగించే బాధ్యత ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎంఈవో ఆర్‌ఎస్‌వీఎస్ గంగాధరశర్మ, ఈవోపీఆర్‌డీ కేఎం వైభవతి, ఏవో కె గోవిందరాజులు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి ఎలిజబెత్, సూపర్‌వైజర్లు డి కమల, ఎస్‌కే అమలేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాల ఆదాయం అభివృద్ధి పనులకు వినియోగం

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని ఎల్బీచర్ల ఉన్నత పాఠశాలలో ఉన్న సుమారు 80 ఫలవృక్షాల ఫలసాయాన్ని స్కూలు అభివృద్ధికే వినియోగించాలని ఎల్బీచర్ల వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బొడ్డు ఆశిష్‌కుమార్ శుక్రవారం కోరారు. హైస్కూల్ ఆవరణలో ఉన్న చెట్ల ఫలసాయాన్ని ఐదేళ్ల క్రితం వేలం నిర్వహించారని అప్పట్లో ఏడాదికి సుమారు రూ.లక్ష వరకూ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఇదే విషయమై పలుమార్లు ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ చెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని స్కూల్ అభివృద్ధికి ఉపయోగించాలని వెంటనే దీనిపై స్పందించి బహిరంగ వేలం నిర్వహించాలని కోరారు. స్కూల్ ఆవరణలో బ్రిటిష్ కాలం నాటి చారిత్రక భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఉప్పు సత్యాగ్రహం సమయంలో గాంధీజీని ఇదే భవనంలో ఉంచారని పేర్కొన్నారు. ఆ శిథిల భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆశిష్ కోరారు. సైకిల్ స్టాండ్‌ను నిర్మించాలని కోరారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం


అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: అన్నా క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించినట్టు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను మంత్రి రామానాయుడు ఢిల్లీ వెళుతున్న కారణంగా వేకువజామునే ప్రారంభించారు. పేదలకు, కార్మికులకు రోజుకు రూ. 15తో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయంలో మూడు పూటలా కడుపునిండా ఆహారం తినవచ్చని అన్నారు. పెచ్చెట్టి బాబు, జక్కంపూడి కుమార్, కోడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై ఉప ముఖ్యమంత్రి పవన్ ఫొటో ఏదీ?
అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవ శిలాఫలకంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో లేకపోవడంతో జనసైనికులు ప్రశ్నించినట్టు సమాచారం. దీనిపై కొందరు జన సైనికులు నిరుత్సాహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు తమను మరీ చిన్నచూపు చూస్తున్నారని వారు వాపోతున్నారు.

ఏఐతో మానసిక వికాసం

భీమవరం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మానసిక వికాసానికి దోహదం చేస్తుందని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాలలో శుక్రవారం వేదిక్ విజన్ 2024 పేరిట నిర్వహించిన 24 హేక్‌థాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హేక్‌థాన్ కార్యక్రమంలో క్రికెట్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై పూర్తి సమాచారంతో యాప్ రూపొందించిన మూడో సంవత్సరం విద్యార్థులు టి.రాజేష్, ఎస్‌వీ వాసు, టీఎస్‌ఎన్ మణికంఠ, పి.నికిలేశ్వర్, ఎం.హరీష్, పి.వెంకట రమణ మొదటి స్థానం సాధించగా వారికి రూ.10 వేలు నగదు బహుమతి అందించారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో యోగా, స్పోర్ట్స్, ఫిజియాలజీ రూపొందించి ద్వితీయ బహుమతి పొందిన గ్రంధి హర్షితరాజు, వినాయక, బి.ఉమా వెంకట కార్తీక్, సీహెచ్ రితిస్, కె.లక్షితలకు రూ.6 వేలు, మూడో బహుమతిగా రూ.4వేలు అందించారు. కార్యక్రమానికి ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణరాజు అధ్యక్షత వహించగా కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, వి.చంద్రశేఖర్, పి.భవాని, సీహెచ్ హరిమోహన్, జి.సారిక, తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టుపై వెలగని విద్యుత్ దీపాలు

నరసాపురం : నరసాపురం గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైటు వెలగడం లేదు. కొన్ని చోట్ల పనిచేయని లైట్లను తొలగించి మునిసిపల్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలంధరరేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో వీధి దీపాలు సవ్యంగా వెలగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ ఏటిగట్టు ప్రాంతానికి సాయంత్రం వేళల్లో పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో షికారుకు వస్తారు. రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారం అలుముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దుంపగడపలో వింత జ్వరాలు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో వింత జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జ్వరంతో పాటు కాళ్లు, చేతులు వాచిపోవడం, నడవలేని పరిస్థితి, ముఖంపై నల్లటి మచ్చలు రావడం, ఒళ్లు నొప్పులు వంటివి వస్తున్నాయని పలువురు వ్యాధి గ్రస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైరల్ ఫీవర్ వచ్చిన వెంటనే ఈ రకమైన లక్షణాలు కన్పిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది చేసిన వైద్యం ఫలించలేదని, మండల సీహెచ్‌సీకి వెళ్లినా సరైన స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యులు రాజశేఖర్‌ను వివరణ కోరగా వైరల్ ఫీవర్ తరువాత ఈ లక్షణాలు కన్పిస్తున్నాయని చెప్పారు. శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ ఆ ప్రాంతానికి వెళ్లి వైద్యం అందిస్తారన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ వైద్యులు గ్రామంపై దృష్టి పెట్టామన్నారు.

తూతూ మంత్రంగా వైద్యుల పర్యటన
ఆకివీడు: వైరల్‌ఫీవర్‌తో కొట్టుమిట్టాడుతూ కోలుకుంటున్న ప్రజలను ఇతర వ్యాధులు కబళిస్తుంటే వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకుండా సమీక్షలు నిర్వహించడమేమిటని ప్రజ లు నిలదీస్తున్నారు. మండలంలోని దుంపగడపలో శుక్రవారం మండల పీహెచ్‌సీ వైద్య బృందం వెళ్లి గ్రామంలో పర్యటించకుండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో, హెల్త్ సెంటర్‌లో సమీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం : నరసాపురం కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ తెలిపారు. అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుదాయని చెప్పారు. రాజీ చేసుకోదగ్గ సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి, కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

భీమవరం అర్బన్: బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అలాగే చట్టరీత్యా నేరమని భీమవరం సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరం మండలంలోని అనాకోడేరు అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం 100 రోజుల పాటు జరిగే మిషన్ శక్తి పథకంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఆడవాళ్లకు 18, మగవాళ్లకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. వారు ఆలోచించే సామర్థ్యం లేక జీవితంలో ఎన్నో ఇబ్బందులకు గురవుతారన్నారు. బాల్య వివాహాలు చేసినా, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వారిపై దాడులు, అత్యాచారాలు చేసినా చట్టంలో కఠిన శిక్షలు అమలులో ఉన్నాయన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, విద్యార్థినులు, మహిళలు, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నగదు బహూకరణ


ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు నగదు బహూకరించి సత్కరించిన దాత

పాలకొల్లు సెంట్రల్: ప్రతిభ కలిగిన విద్యార్థులకు దాతల సహకారం ఎప్పుడూ ఉంటుందని దాత పొట్నూరి అప్పన్న అన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని స్థానిక బీవీఆర్‌ఎం బాలికోన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన 9 మంది బాలికలకు దాత పొట్నూరి అప్పన్న వారి తండ్రి జ్ఞాపకార్థం నగదు బహూకరించారు. ఒక్కో విద్యార్థినికి రూ.వెయ్యి, ఇద్దరు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.3 వేలు చొప్పున మొత్తం రూ.15 వేలు నగదు అందజేసి శాలువాలతో సత్కరించి, ఆంగ్ల గ్రామర్ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు


భీమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: అంగన్‌వాడీల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి హెచ్చరించారు. శుక్రవారం ఆచంట మండలం భీమలాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు, గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చిన్నారులకు సమయానికి ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మాధవరావు, స్కూల్ చైర్మన్ కౌరు త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

ఆకివీడు: ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పని చేస్తుందని సంఘ మండల కార్యదర్శి నేతల ప్రకాష్ బాబు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సంఘ రిజిస్ట్రేషన్ పొందిన రోజు సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ అధ్యక్షుడు జి.చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై 2019 నుంచి సంఘం అనేక పోరాటాలు చేసి ఫలితాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, సంఘ అసోసియేట్ అధ్యక్షులు ఫరూక్, పల్సన్, కోశాధికారి సుందర్‌పాల్, వ్యవసాయాధికారిణి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

భీమవరం: పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ (పీఎస్‌ఎం) గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు పట్టణానికి చెందిన నాచు ఫణిరాజు ఆర్థిక ప్రోత్సాహకం అందించారు. గత విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన ఏ.నవ్యశ్రీ, బి.దివ్య శ్రీలక్ష్మిలకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున నగదు, జ్ఞాపికలను అందించారు. హెచ్‌ఎం వారణాసి రాధాకృష్ణ మాట్లాడుతూ తమ స్కూల్లో టెన్త్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఉండి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. శుక్రవారం మండలంలోని ఉణుదుర్రులోని అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి వందరోజుల కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. వీరందరికీ అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ప్రీ స్కూల్ విద్యను అందిస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.రత్నకుమారి, ఏఎన్‌ఎం వై.సంధ్యారాణి పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

భీమవరం: దాడి చేసి, కొట్టి గాయపరిచారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసినట్లు భీమవరం టుటౌన్ ఎస్సై రెహ మాన్ శుక్రవారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. భీమవరం మండలం చినఅమిరం గ్రామానికి చెందిన మన్నె ఆనంద్‌కుమార్ ఈ నెల 15 రాత్రి భీమవరం నుంచి చినఅమిరం మోటారు సైకిల్‌పై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన ఉదయకుమార్ అతనిపై దాడి చేసి కొట్టాడు. దీంతో గాయపడిన ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులు చికిత్స కోసం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

ఇంటింటా శ్రావణ శోభ


అడవిపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం పూజలు వైభవంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పూజ అనంతరం మహిళలు చేతికి తోరణాలు కట్టుకుని ముత్తైదువులకు తోరణాలు కట్టి వాయినాలు, తాంబూలాలు అందజేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. సాయంత్రం సమీపంలో ఉన్న అమ్మవారి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీపార్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు
మొగల్తూరు: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రావణ శుక్రవారం పూజలు
యలమంచిలి: శ్రావణ శుక్రవారం సందర్భంగా అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, పంచామృతాభిషేకం చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
పెనుగొండ: వరలక్ష్మీ వ్రతాన్ని పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు.

వేములదీవి వెంకన్నకు సహస్ర నామ మాల సమర్పణ


వేములదీవిలోని వేంకటేశ్వరస్వామికి సహస్ర నామ మాలను సమర్పిస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: వేములదీవిలోని వేంకటేశ్వర స్వామికి శనివారం హైదరాబాద్‌కి చెందిన సంపర సాయి కృష్ణ, ప్రణీత దంపతులు సహస్ర నామ మాలను సమర్పించారు. కోరిన కోర్కెలు నెరవేర్చే స్వామిగా ఇక్కడి స్వామివారు ప్రసిద్ధికెక్కడంతో ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఏడు వారాల ప్రదక్షిణలు చేయడం, మొక్కులు చెల్లించి, తలనీలాలను సమర్పించే భక్తుల సంఖ్య పెరగడంతో ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసి ఉంది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సుమారు వెయ్యిమందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

సీఎంఎస్‌లో వాటర్ ప్లాంట్‌కు విరాళం


మేడపాడు సీఎంఎస్‌లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు విరాళం అందిస్తున్న భార్గవీలక్ష్మి నయనాల

యలమంచిలి: మేడపాడులో క్రిస్టియన్ మిషనరీ సంస్థ (సీఎంఎస్)లో ఉంటున్న అనాథ బాలలకు సురక్షిత మంచినీరు అందించేలా వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు మేడపాడు గ్రామానికి చెందిన ఎన్నారై భార్గవీలక్ష్మి నయనాల శుక్రవారం రూ.40 వేలు విరాళం అందజేశారు. అమెరికాలో ఉంటున్న భార్గవీలక్ష్మి ఈ ఏడాది వైద్య విద్యనభ్యసించేందుకు సిద్ధమవుతున్నారు. ఆమె అమెరికాలోనూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తన అమ్మమ్మ గ్రామమైన మేడపాడులో ఉన్న అనాథ బాలలకు చెందిన సంస్థకు ఈ విరాళం అందించారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఆమె పండ్లు, పండ్ల రసాలు అందజేశారు. ఆమె తాత మేడపాడు మాజీ సర్పంచ్ అడ్డాల వాసుదేవరావు పాలకొల్లు రూరల్ లయన్స్ క్లబ్ చైర్మన్ సంగినీడి రంగారావు, సభ్యులు సుబ్బారావు, హాస్టల్ ఇన్‌చార్జి పడాల జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తాం


కాళీపట్నంలో జాతీయ రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్, మరియు అధికారులు

మొగల్తూరు: జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నరసాపురం, సీతారాంపురం, మొగల్తూరు, ముత్యాలపల్లి, కాళీపట్నం తూర్పు గ్రామాల మీదుగా రహదారి నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా కాళీపట్నం తూర్పులో జాతీయ రహదారి నిర్మాణంలో తలెత్తిన లోపాలు కారణంగా మురుగు బోదె నుంచి ప్రవహించాల్సిన మురుగు నీరుతో పాటు వర్షపు నీరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో పాటు సమీప చేలల్లోకి నీరు చేరడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు, రైతులు కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్ విద్యాపతి, ఆర్ఐ నిరంజన్, జాతీయ రహదారి విస్తరణ అధికారులు కాళీపట్నం తూర్పు గ్రామంలో పర్యటించి గ్రామస్తులు, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విద్యాపతి మాట్లాడుతూ రైతులకు, గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరలో సమస్యను పరిస్కరిస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ మేడిది సజన్య, ఎంపీటీసీ సభ్యురాలు తణుకుల శ్రీ వెంకటదుర్గ, నాయకులు మేడిది, బాబ్జి, ప్రభాకర్, తణుకుల వాసు, తణుకుల వెంకన్న, కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రాజీవ్ నగర్, రైల్వే గేటు ఫీడర్స్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి సురేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పట్టణంలోని బీఆర్‌ఎంవీ స్కూల్, లాక్‌డౌన్ సెంటర్, రామారావుపేట, వీవర్స్ కాలనీ, హనుమాన్ కాలనీ, లజపతిరాయ్‌పేట, పెద సాయిబాబా టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

పెనుగొండ సబ్ స్టేషన్ పరిధిలో..
పెనుగొండ: పెనుగొండ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ సురేష్ కుమార్ తెలిపారు. నిర్వహణ నిమిత్తం, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడతామన్నారు. దీంతో శనివారం ఉదయం నుంచి పెనుగొండ, వడలి, కొఠాలపర్రు, సోమరాజు చెరువుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

నరసాపురం, సీతారామపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..
నరసాపురం రూరల్: నరసాపురం మండలం నరసాపురం, సీతారామపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలుగ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి సురేష్ కుమార్ తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింపు దృష్ట్యా 17వ తేదీ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ లిఖితపూడి, సరిపల్లి, మండవారిపేట, మంగళగుంటపాలెం, కొప్పర్రు, లక్ష్మణేశ్వరం, సారవ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.